క్లుప్తంగా

రేపు మాజీ ఎంపీ రంగయ్య పర్యటన

కళ్యాణదుర్గం: అనంతపురం మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య నియోజకవర్గంలో సోమవారం పర్యటించనున్నట్లు పార్టీ కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదలయ్యింది. 18న ఉదయం 9:30 గంటలకు వైఎస్సార్‌సీపీ కార్యాలయం (సరోజా కాంపౌండ్)లో కనకదాస జయంతి వేడుకలు ఉంటాయి. ఉదయం 10:30 గంటలకు కంబదూరు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే నూతన ఎంపీపీ కురబ లక్ష్మీదేవి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాజీ ఎంపీ పాల్గొననున్నారు.

రైతు కుటుంబానికి పరామర్శ



వి.కొత్తకోటలో రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న వ్యవసాయాధికారులు

విడపనకల్లు: మండల పరిధిలోని వి.కొత్తకోట గ్రామానికి చెందిన జొన్నగిరి మధుసుదన్ అనే రైతు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. శనివారం మండల వ్యవసాయాధికారి పెన్నయ్య,రెవెన్యూ శాఖాధికారులు గ్రామానికి వెళ్ళి రైతు కుటుంబాన్ని పరామర్శించారు. అప్పుల వివరాలు, కుటుంబ జీవన స్థితి బట్టి నివేదిక తయారు చేసి జిల్లా కలెక్టర్‌కు పంపుతామని వ్యవసాయాధికారి పెన్నయ్య తెలిపారు. కార్యక్రమంలో హార్టికల్చర్ ఏఓ నెట్టికంఠయ్య, సచివాలయ వీఆర్వో హరి కిషోర్, ఎంపీఈఓ అబ్దుల్ కరీం, మాజీ ఎంపీటీసీ లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కోసం రూ.10 లక్షల విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దాత వాల్మీకి పార్వతి

రాయదుర్గంటౌన్: మండలంలోని మల్లాపురం గ్రామంలోని విప్రమలై లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద నీటి ట్యాంకు నిర్మాణానికి డాక్టర్ ఎల్లప్ప, సతీమణి వాల్మీకి పార్వతి రూ.10 లక్షల విరాళం అందజేశారు. ఈ మేరకు ఆలయ కమిటీ నిర్వాహకులకు శనివారం విరాళ చెక్కును ఆలయ కమిటీ అధ్యక్షుడు బీఎస్ తిప్పేస్వామి, ఉపాధ్యక్షుడు ధర్మన్న, కోశాధికారులు సత్యనారాయణ, జీఎస్ నరసింహులు, కార్యదర్శి గురు రాఘవేంద్రప్రసాద్‌కు అందజేశారు. దాత పార్వతి కుటుంబ సభ్యులు వాల్మీకి రవి పాల్గొన్నారు.

రైతు సేవాకేంద్రాల తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న డీడీ వెంకటేశులు

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని తిమ్మసముద్రం, ఈస్ట్‌కోడిపల్లి, కొత్తూరు, పాలవాయి గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలను పశుసంవర్ధక శాఖ డీడీ వెంకటేశులు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. డీడీ వెంకటేశులు మాట్లాడుతూ ఈనెల 21న పాలవాయి గ్రామంలో పశుగణన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అనంతరం గ్రామాల్లో జీవాలను పరిశీలించి,రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు, ఏహెచ్ఏ పాల్గొన్నారు.

ఎన్‌సీడీ సర్వేను పర్యవేక్షించిన వైద్యాధికారులు



మోపిడిలో ఎన్‌సీడీ సర్వేలో భాగంగా పిల్లల ఎత్తును ఇంటి వద్దే చూస్తున్న వైద్య సిబ్బంది

ఉరవకొండ: మధుమేహం, ఓరల్ రొమ్ము కేన్సర్ లాంటి జబ్బులను గుర్తించడానికి నిర్వహిస్తున్న ఎన్‌సీడీ సర్వేను రాకెట్ల, కొకుంట్ల పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ వెంకటేష్‌నాయక్, డాక్టర్ పావని, డాక్టర్ అనికేత్ శనివారం పర్యవేక్షించారు. రాకెట్ల పీహెచ్‌సీ పరిధిలోని మోపిడి గ్రామంలో ఈసర్వేను వైద్యాధికారులతో పాటు సీహెచ్‌ఓ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీలు పర్యవేక్షించారు.

హెచ్‌ఐవీపై అవగాహన ఉండాలి

కళ్యాణదుర్గం రూరల్: విద్యార్థులకు హెచ్‌ఐవీపై అవగాహన కల్పించాలని ప్రిన్సిపాల్ నాగరాజు, రైడ్స్ ప్రాజెక్ట్ మేనేజర్ మహేష్ తెలిపారు. శనివారం పట్టణంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం వరలక్ష్మి, రైడ్స్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మో.. నిమోనియా



- అశ్రద్ధ చేస్తే ప్రాణానికి ప్రమాదం
- ఆస్పత్రుల్లో పెరుగుతున్న ఓపీ,ఐపీ కేసులు
- కాశీపురంలో వ్యాధి లక్షణాలతో ఇద్దరు మృతి

రాయదుర్గం: [illegible] చలిగాలుల [illegible] స్తోంది. రోజు రోజుకూ ఈ వ్యాధి బారిన పడిన వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. జాగ్రత్తలు పాటించకపోతే ప్రాణాలకు ప్రమాదం జరగొచ్చు. ఆస్పత్రుల్లో ఓపీ, ఐపీ కేసులూ పెరుగుతున్నాయి. ఇటీవల మండలంలోని కాశీపురానికి చెందిన గౌతమ్ అనే రెండో తరగతి విద్యార్థి నిమోనియా లక్షణాలతో అనంతపురం సవేరా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇదే గ్రామానికి చెందిన అవినాష్ అనే విద్యార్థి కూడా ఇటీవల నియోనియాతో మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది. ఈ రెండే చోట్లో కాదు.. అజాగ్రత్త చేస్తే సీజన్ ముగిసే సరికి మరిన్ని మరణాలు తప్పవు. వ్యాధి సోకినా సకాలంలో చికిత్స తీసుకుంటే సులభంగా గట్టెక్కొచ్చు.

జిల్లాలోని కర్ణాటక సరిహద్దున ఉన్న రాయదుర్గం ఏరియా ఆస్పత్రితో పాటు కణేకల్లు, కళ్యాణదుర్గం, ఉరవకొండ మూడు సీహెచ్‌సీలు, అర్బన్, మండల పీహెచ్‌సీలు 30 ఉన్నాయి. వీటికి తోడు ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లు, క్లినిక్‌లు 200ల వరకు ఉంటాయి. వీటిలో సుమారు 4,500 నుంచి ఐదువేల వరకు ఓపీ, ఐపీ కేసులు నమోదవుతున్నాయి. ఇందులో ఎక్కువ శాతం దగ్గు, జలుబు, ఫ్లూ, నిమోనియా లాంటి కేసులు కనిపిస్తున్నాయి. ఈ వ్యాధి లక్షణాలతో బాధపడుతూ ఒక్క ఏరియా ఆస్పత్రికే 60 నుంచి 80 మంది వరకు చికిత్స కోసం వస్తున్నారు. ముఖ్యంగా అప్పుడే పుట్టిన పసికందు నుంచి ఐదేళ్ల లోపు పిల్లలపై ఈ వ్యాధి ప్రభావం అధికంగా ఉంటుంది.70 శాతం రైలో వైరస్ వల్ల, 30 శాతం బ్యాక్టీరియాల ప్రభావంతో నిమోనియా వ్యాపించే అవకాశం ఉంది.

ఇన్‌ఫెక్షన్‌తో జాగ్రత్త


ఈ వ్యాధి వైరస్ వల్ల, బ్యాక్టీరియా, క్షయవ్యాధి లక్షణాలున్న వారికి దగ్గరవుతోంది. పొగతాగడం, చలిగాలుల్లో ఎక్కువగా తిరగడం, కుటుంబ పరంగా ఆస్తమా, అనారోగ్య పరిస్థితుల వల్ల ఈ వ్యాధి సోకే అవకాశం ఎక్కువగా ఉందని వైద్యులు చెపుతున్నారు. శరీరంలో ఉండే కరుపులు వల్ల రక్తం ఊపిరి తిత్తుల్లోకి వెళ్లి న్యుమోనియాగా మారుతుంది. ఈ వ్యాధిని ఎక్స్‌రే, సి.టీ స్కాన్, రక్త పరీక్షల ద్వారా సులభంగా గుర్తించవచ్చు.

వ్యాధి లక్షణాలు ఇవీ..



ఈ వ్యాధి అన్ని వయసుల వారికీ సోకుతోంది. ముఖ్యంగా ఐదేళ్ల లోపు పిల్లలు, 65 ఏళ్ల పైబడిన వృద్ధులకు వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉంటుంది. ఈ నేపథ్యంలో అలాంటి వారికి ఎక్కువగా సోకుతుంది. దరచూ దగ్గు, కళ్లు పచ్చగా కనిపించడం, దగ్గినప్పుడు రక్తం పడటం, ఆయాసం, అలసట, ఛాతీలో నొప్పి, ఊపిరి పీల్చుకోవటం కష్టంగా ఉండటం, జ్వరం, చలి, వణుకు, తల నొప్పి, కండరాల నొప్పులు, చెమటలు పట్టడం, గుండె వేగంగా కొట్టుకోవడం లేదా తక్కువగా కొట్టుకోవడం, వికారం, వాంతులు, విరేచనాలు, పిల్లలు పాలు తాగలేకపోవడం తదితర లక్షణాలు వ్యాధి సోకిన వారిలో కనిపిస్తాయి. చలికాలంలో నిమోనియా కేసులు ఎక్కువగా నమోదవుతాయి.

నివారణ చర్యలే ఉత్తమం



వ్యాధి రాకుండా ముందస్తుగా పుట్టిన ప్రతి బిడ్డకు వ్యాక్సిన్ వేయించాలి. వ్యాధి సోకకుండా నివారించే వ్యాక్సిన్‌లు పిల్లలకు, పెద్దవారికి అందుబాటులో ఉన్నాయి. అన్ని ప్రభుత్వ ఆస్పత్రిల్లో ఉచితంగా ఈ టీకా ఇస్తున్నాం. విచ్చల విడిగా యాంటీబయోటిక్స్ వినియోగించరాదు. పబ్లిక్ ప్రదేశాల్లో వెళ్లినప్పుడు ముఖానికి మాస్క్ అడ్డుపెట్టుకోవడం ఉత్తమం. ఈ నెల 12 నుంచి 2025 ఫిబ్రవరి వరకు సాంప్స్ కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. వ్యాధి తీవ్రతపై సత్వరం చికిత్స అందేలా చర్యలు చేపడతాం. కాశీపురంలో మృతి చెందిన విద్యార్థి వివరాలు సేకరిస్తాం.

– డాక్టర్ యుగంధర్, డిప్యూటి డీఎంహెచ్‌ఓ, అనంతపురం

శీతాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి



చలిగాలులు ప్రారంభమయ్యాయి. ఈ శీతాకాలం ముగిసే వరకు చిన్నారులు, వృద్ధులు జాగ్రత్తలు పాటించాలి. వెచ్చటి ప్రదేశాల్లో సేదా తీరాలి. నిమోనియా లక్షణాలున్న వారు బాగా విశ్రాంతి తీసుకోవాలి. క్రమం తప్పకుండా మందులు వాడాలి. మద్యపానం, ధూమపానం తాగకుండా ఉండాలి. దగ్గినా, తుమ్మినా ముఖానికి కర్చీఫ్ అడ్డుపెట్టుకోవాలి. తరచూ చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. ఆరోగ్య కరమైన ఆహారం వేడిగా ఉన్నప్పుడే తీసుకోవాలి. వారంలో కనీసం ఐదు రోజులు వ్యాయామం చేయాలి. ఓపీలో దగ్గు, జలుబు, జ్వరం కేసులు వస్తున్నాయి. ఈ వ్యాధిపై ఎలాంటి ఆందోళనా అవసరంలేదు. ఆస్పత్రిలో అన్ని రకాల జబ్బులకు మందులు అందుబాటులో ఉన్నాయి. ఉచితంగా అందిస్తున్నాం.

– మెర్సీ జ్ఞానసుధ, సూపరింటెండెంట్, రాయదుర్గం ఏరియా ఆస్పత్రి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్లు విడుదల



రాష్ట్ర మహాసభల పోస్టర్లు విడుదల చేస్తున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు హనుమంతరాయుడు

ఉరవకొండ: ఈనెల 27, 28, 29, 30 తేదీల్లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విజయనగరంలో జరగనున్న 49వ రాష్ట్ర మహాసభల పోస్టర్లను విద్యార్థి సంఘం నాయకులు శనివారం విడుదల చేశారు. స్థానిక ప్రభుత్వ ఎస్సీ వసతి గృహ ప్రాంగణంలో మహాసభల పోస్టర్లను జిల్లా అధ్యక్షుడు హనుమంతరాయుడు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలను విడుదల చేసి చదువులకు ఆటంకం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి చందు, కోశాధికారి రాజు, ఉపాధ్యక్షులు లెనిన్, బెళుగుప్ప రాజేష్, కరుణాకర్, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

ముళ్ల పొదల తొలగింపు

విడపనకల్లు: మండల పరిధిలోని విడపనకల్లు నుంచి వేల్పుమడుగు గ్రామానికి వెళ్లే రహదారిపక్కన ముళ్ల పొదలను పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ మునాఫ్, గ్రామ సర్పంచు తిప్పారెడ్డి ఆధ్వర్యంలో జేసీబీతో శనివారం తొలగించారు. కడ్లే గౌరమ్మదేవి ఉత్సవాలు జరుగుతుండడంతో భక్తులు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న ముళ్ల కంపలను తొలగించినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకొని వ్యక్తిని అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

విడపనకల్లు: మండలంలోని హంచనహాల్‌లో కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఉరవకొండ ఎక్సైజ్ అధికారులు దాసరి భార్గవ్ నుంచి 136 హైవార్డ్స్, చేర్స్ విస్కీ, టెట్రా ప్యాకెట్లు, కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. దాసరి భార్గవ్‌ను ఉరవకొండ కోర్టులో హాజరు పరిచి, రిమాండ్‌కు పంపినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సుహాసిని, ఎస్ఐ పోతులయ్య, తెలిపారు.దాడిలో ఎక్సైజ్ శాఖాధికారులు నరేష్, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

నేమకల్లు అంజన్నకు కార్తీకమాస పూజలు



ప్రత్యేక అలంకర ణలో నేమకల్లు ఆంజనేయస్వామి



సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన శ్రీ నేమకల్లు ఆంజినేయస్వామి దేవాలయంలో మూడవ శనివారం కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మూల విరాట్‌ను పట్టువస్త్రాలతో, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే స్వామివారికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, విశేష వెండి తమలపాకు అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేశారు. కర్ణాటక, ఆంధ్రా ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు వచ్చి స్వామిని దర్శించుకున్నారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. కార్తీకమాసం సందర్భంగా వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమం జరిగింది.

బసాపురం అంజన్నకు విశేష పూజలు

కూడేరు: మండల కేంద్రం సమీపంలోని అతిపురాతన బసాపురం ఆంజనేయ స్వామి ఆలయంలో కార్తీక శనివారాన్ని పురస్కరించుకొని ఆలయ అర్చకులు దుర్గ చైతన్య ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత క్షీరాభిషేకం చేసి, తర్వాత పట్టు వస్త్రాలు, పుష్పాలతో విశేషంగా అలంకరణ చేశారు. జిల్లా నలమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ఈ పూజల్లో పాల్గొన్నారు. ఆంజనేయ స్వామి దేవతామూర్తిని దర్శించుకున్నారు. సాయంత్రం పల్లకీలో ఆంజనేయ స్వామి మూల విరాట్‌ను ఊరేగించారు.

మార్మోగిన రామ నామం

కూడేరు: స్థానిక కోదండరామాలయంలో శనివారం జై శ్రీరామ్ అంటూ రామ నామం మార్మోగింది. సీతారాముల దేవతామూర్తులకు ఆలయ అర్చకుడు భాస్కర్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. పట్టు వస్త్రాలు, పుష్పాలతో అలంకరణ చేశారు.

గజగౌరీదేవికి చక్కెర హారతులు



గజగౌరీ దేవికి చక్కెర హారతులు సమర్పిస్తున్న మహిళలు

బొమ్మనహాళ్: గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టే గజగౌరీ ఉత్సవాలు రెండో రోజు ఘనంగా జరిగాయి. మండలంలోని వివిధ గ్రామాల్లో గజగౌరీ దేవికి మహిళలు హారతులు సమర్పించారు. శనివారం మండలంలోని ఉద్దేహాళ్, ఉంతకల్లు, బొమ్మనహాళ్, నేమకల్లు, కురువళ్లి, సిద్ధరాంపురం, గోనేహాళ్, శ్రీధరఘట్ట, శింగానహళ్లి , కృష్ణాపురం, లింగదహాళ్, కొలగానహళ్లి, దేవగిరి క్రాస్ తదితర గ్రామాల్లోని మంటపాలలోను, ఆలయం వద్ద గజగౌరీదేవికి పూజలు చేశారు. యువతులు, మహిళలు, భక్తులు చక్కెర హారతులు, నూతన వస్త్రాలు , పసుపు కుంకుమ, గాజులు సమర్పించారు. ఆదివారం ఉదయం తెల్లవారుజామున గజగౌరీదేవి ఊరేగింపు నిర్వహించి, అనంతరం నిమజ్జనోత్సవం నిర్వహించారు.

మినీ గోకులాలను త్వరితగతిన నిర్మించండి



పూలచెర్లలో మినీ గోకులాల షెడ్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ సలీంబాషా

కణేకల్లు: మినీ గోకులాల షెడ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని డ్వామా పీడీ సలీంబాషా అధికారులకు ఆదేశించారు. మండలంలోని పూలచెర్ల, గోపులాపురం గ్రామాల్లో నిర్మిస్తున్న మినీ గోకులాల షెడ్ల పనులను రాయదుర్గం ఏపీడీ అయిషాతో కలిసి శనివారం పరిశీలించారు. మండలంలో కనిష్టంగా 41 మినీ గోకులాలు నిర్మించాలన్న లక్ష్యం ఉన్నా ..ఎక్కువ దరఖాస్తులొచ్చినా మంజూరు చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ సుధాకర్, టెక్నికల్ అసిస్టెంట్ నరసింహాచారి, ఈసీ వెంకటరమణ పాల్గొన్నారు.

పీహెచ్‌సీ నిర్మాణంలో జాప్యమెందుకు..?



ప్రొటోకాల్ విషయంపై ప్రశ్నిస్తున్న ఎంపీపీ నారాయణ రెడ్డి

కూడేరు: కొర్రకోడులో పీహెచ్‌సీ నిర్మాణానికి రెండెకరాల స్థలం కేటాయింపు జరిగింది.. భవన నిర్మాణ పనులు చేపట్టకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారని సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్ అధికారులను ప్రశ్నించారు. శనివారం కూడేరులోని ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ నారాయణ రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. అన్ని శాఖలపై సమీక్షించారు. పలు అంశాలపై అధికారుల తీరును సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ప్రశ్నించారు. గోకులం షెడ్ల మంజూరు చేయాలని కోరితే టీడీపీ నేతలతో చెప్పించాలని చెప్పారు. టీడీపీ నేతలను తామెందుకు అడుగుతామని, వైస్ ఎంపీపీ సుబ్బమ్మ (వైఎస్సార్ సీపీ) పశు వైద్యాధికారి శ్రీనివాసులును ప్రశ్నించారు. పశువులకు వైద్య సేవల కోసం ఫోన్ చేస్తే మీరు స్పందించకపోతే ఎలా ?అని సర్పంచులు ఓబులేసు, ధనుంజయ్య నిలదీశారు. ఏఓ విజయకుమార్ సబ్సిడీ విత్తనాలు పంపిణీ, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలకు వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులైన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులను పిలవడం లేదని ఎంపీపీ నారాయణ రెడ్డి నిలదీశారు. అరవకూరులో ఈ–క్రాప్ నమోదును ఇష్టారాజ్యంగా నమోదు చేస్తున్నారని, అర్హులకు న్యాయం జరగాలని వైస్ ఎంపీపీ దేవా ఏఓకు సూచించారు. ఉదిరిపికొండ సర్పంచ్ నాగమ్మ మాట్లాడుతూ తమ గ్రామానికి పీఏబీఆర్ డ్యాం నుంచి వచ్చే ప్రాజెక్ట్ వాటర్ సరఫరా కావడం లేదని, సక్రమంగా నీటి సరఫరా చేసి ప్రజలకు నీటి సమస్య లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు అశ్వని, వైస్ ఎంపీపీలు దేవ, సుబ్బమ్మ, కోఆప్షన్ సభ్యుడు సర్దార్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీడీఓ కుళ్లాయి స్వామి, హౌసింగ్ ఏఈ హనుమప్ప, ఏపీఎం దేవానంద ఫిలిప్‌సన్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగ దివ్య, సీఎస్‌డీటీ లక్ష్మీదేవి, అధికారులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే జ్ఞాన సముపార్జన

కుందుర్పి: పుస్తక పఠనంతోనే జ్ఞాన సముపార్జన సాధ్యమని ఎంపీపీ కమలమ్మ, సర్పంచ్ మారుతేశ్వరి తెలిపారు. శనివారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన, వ్యాచన పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అసిస్టెంట్ భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్షాలతో వరి రైతులకు అపార నష్టం

కుందుర్పి: నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి పంట నేలకూలడంతో రైతులకు అపార నష్టం జరిగింది. కెంచంపల్లి, కలిగొలిమి, మలయనూరు తదితర గ్రామాల్లో వంద ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు బాధిత రైతులు తెలిపారు.

బెల్టు దుకాణాలను తొలగించాలని ఫిర్యాదు

కుందుర్పి: మండల వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన బెల్టు దుకాణాలను తొలగించి గ్రామాల్లో శాంతి భద్రతలను పరిరక్షించాలని ఎంపీపీ కలమలమ్మ ఆధ్వర్యంలో మహిళా సర్పంచులు కంబదూరు ఎక్సైజ్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. మండలంలోని 36 గ్రామాలుండగా మండల కేంద్రంలోనే 12 బెల్టు దుకాణాలు, మిగిలిన గ్రామాల్లో 19 దుకాణాలు కొనసాగుతున్నట్లు తెలిపారు.

విత్తన వేరుశనగకు పేర్లు నమోదు చేసుకోండి

బెళుగుప్ప: మండలంలోని బోరుబావుల కింద సాగు చేసే రైతులకు రాయితీతో వేరుశనగ పంపిణీ చేస్తున్నట్లు ఏఓ పృథ్వీసాగర్ శనివారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం మండలానికి 300 క్వింటాళ్ల కేటాయించిందని, 40 శాతం రాయితీతో కే6 రకం అందిస్తామన్నారు. రైతులకు ప్రభుత్వం క్వింటా వేరుశనగను పూర్తి దర రూ.9,600 కాగా 40 శాతం రాయితీ రూ.3,840 పోనూ రైతు వాటా కింద రూ.5,760 చొప్పున క్వింటాకు చెల్లించాలన్నారు.

సంక్షిప్త సమాచారం

గ్రంథాలయ వారోత్సవాలు

ఉరవకొండ: స్థానిక గ్రంథాలయ శాఖ కార్యాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు శనివారం నిర్వహించారు. గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్, అయ్యంకి వెంకట రమణయ్య, గాడిచర్ల హరిచిత్రపటాలకు పూలమాల వేసి, నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

గొర్రెలు అపహరణ

విడపనకల్లు: మండల పరిధిలోని గడేకల్లు గ్రామంలో పూజారి భీమలింగప్ప ఇంట్లో కట్టేసిన రెండు గొర్రెలను శుక్రవారం అర్ధరాత్రి తీసుకెళ్లారని బాధితుడు వాపోయాడు.

యువకుడి మృతి

శెట్టూరు: మండలంలోని అడవిగొల్లపల్లి గ్రామానికి చెందిన గొల్ల బొజ్జప్ప (30) మృతి చెందారు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. బొజ్జప్ప శుక్రవారం రాత్రి పొలానికి నీరు పెట్టడానికి వెళ్లాడు. ఉదయం ఇంటికి చేరుకున్నాడు. ఉన్నట్లుండి కుప్పకూలాడు. కుటుంబ సభ్యులు అతన్ని కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే బొజ్జన్న మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాంభూపాల్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

రాయదుర్గంటౌన్: మండలంలోని డి.కొండాపురం సమీపంలో శనివారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని ముగ్గురు గాయపడ్డారు. వివరాలు.. వీరాపురానికి చెందిన గంగమ్మ, అశోక్ ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎదురుగా కొండాపురానికి చెందిన రంజిత్ ద్విచక్రవాహనం ఢీకొనింది. దీంతో ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను రాయదుర్గంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితులంతా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

గుమ్మఘట్ట: మండలంలోని ఎర్రంపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శనివారం వైద్య పరీక్షలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులు, పదోతరగతి విద్యార్థులకు పుట్టుకతో వచ్చే వ్యాధులు, లోపాలు , రక్తహీనత తదితర 44 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కడ్లే గౌరమ్మ ప్రతిష్ట

విడపనకల్లు: మండల కేంద్రంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని కడ్లే గౌరమ్మను ప్రతిష్ఠించి, శనివారం పూజలు చేశారు. కడ్లే గౌరమ్మ జాత్రోత్సవాల్లో భాగంగా గ్రామంలో ఊరేగింపుగా తీసు కొచ్చి బసవేశ్వరస్వామి ఆలయంలో కడ్లే గౌరమ్మను ప్రతిష్ఠించారు. ఆదివారం హారతులు, సోమవారం కడ్లే గౌరమ్మ పూల రథోత్సవం ఊరేగింపు ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.


ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలి



గ్రామంలో బ్లీచింగ్ చేయిస్తున్న అధికారులు

రాయదుర్గంటౌన్: పరిసరాల శుభ్రత, వ్యక్తిగత జాగ్రత్తలతో సీజనల్ వ్యాధులు దరి చేరకుండా ఉంటాయని మలేరియా సబ్‌యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ తెలిపారు. రాయదుర్గం మండలం కాశీపురం గ్రామంలో దోమల నివారణకు ఆబెట్, ఇళ్లలో పైరిత్రం పిచికారీ చేయించి, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డెంగీ, నిమోనియా వ్యాధిపై చైతన్యపరిచారు. దోమల లార్వాలు వృద్ధి చెందకుండా నీటి నిల్వలు ఎప్పటికప్పుడు పారబోసి శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రాత్రిపూట దోమ తెరలు వాడితే దోమల నుంచి రక్షణ పొందొచ్చన్నారు. సాయంత్రం పూట వేపాకు పొగ వేసుకోవాలని, ఇంటి కిటికీలకు మెష్‌లు బిగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు అచ్చమ్మ, నరసింహ, ఎంఎల్ఎచ్‌పీ యోచన, కార్యదర్శి అశోక్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి నుంచి పెద్దమాంబదేవి విగ్రహ ప్రతిష్ట



పుట్టశిల పెద్దమ్మ దేవత మూలవిరాట్

బెళుగుప్ప: మండలంలోని కాలువపల్లిలోని పుట్టశిల పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ట, చండీ హోమం నిర్వహించనున్నారు. గ్రామ దేవత పెద్దమ్మ తల్లి గ్రామం వెలసిన తొలినాళ్లలోనే పుట్టశిల అమ్మవారు చిన్న రాతి గుండుగా వెలసి క్రమేణా మూడున్నర అడుగుల ఎత్తుగా పుట్టశిల పెరిగింది. అమ్మవారి రూపం పుట్టశిలపై వెలిసి భక్తుల కొంగు బంగారంగా వెలుగొందుతోంది. గ్రామ దేవత పెద్దమాంబదేవి నిత్యం తమ గ్రామాన్ని కాపాడుకుంటూ వస్తోందని, కోరిన కోర్కెలు తీర్చే వరాల తల్లిగా పిలువబడుతోంది. పుట్టశిల అమ్మవారి చరప్రతిష్ట పూజల్లో భాగంగా సోమవారం గణపతి పూజ, గంగపూజ, పంచగవ్య, నవగ్రహారాధన, ప్రధాన కలశ, వాస్తు కలశస్థాపన, సప్తశతీ పారాయణ, దుర్గాహోమం పూజలు కొనసాగుతాయి. మంగళవారం ప్రాతఃకాల దీక్షా, అధివాప హోమాలు, శయ్యాది పుష్పాదివాస పూజలు, బుధవారం బ్రహ్మ ముహూర్తన చర ప్రతిష్ట , ప్రతిష్టాహోమాలు అనంతరం చండీ హోమం, బలి, పూర్ణాహుతి మహామంగళ హారతులు కొనసాగుతాయి.